సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 6 । జూన్ । 2025



పత్తాలేని పెట్రోలింగ్!

జాతీయ రహదారి వెంట ఎక్కడా పోలీసులు కనిపించడం లేదు. గస్తీ నిర్వహించాల్సిన వాహనాల ఊసే లేదు. 10లో▸



అటవీ భూమి కబ్జా

బషీరాబాద్ మండలంలోని మైల్వార్ రిజర్వుడు ఫారెస్టులో ఐదు ఎకరాల అటవీ భూమి కబ్జాకు గురైంది. 10లో▸



శాస్త్రీయ పద్ధతులతో..

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. 11లో▸

జిల్లా వ్యవసాయాధికారితో

‘సాక్షి’ ఫోన్ ఇన్

వికారాబాద్: వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డితో ఈనెల 6న ఉదయం 10నుంచి 11:30 గంటల వరకు ‘ఫోన్ ఇన్’ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి సందేహాలనునివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025

సమయం : ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:

8977755890, 9010299041

న్యూస్‌రీల్

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన బోధన

జిల్లా ఇంటర్ విద్య నోడర్ ఆఫీసర్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

తాండూరు: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని జిల్లా ఇంటర్ విద్య నోడర్ ఆఫీసర్ శంకర్‌నాయక్ అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం మరింత పెరిగేలా బోధన చేయాలని సూచించారు. గురువారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 77 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కళాశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు సమకూరుస్తామని తెలిపారు.

మొక్కలతోనే మానవ మనుగడ

పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి నాగుల శిల్ప తదితరులు

పరిగి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప సూచించారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెట్లు మానవ మనుగడకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. రోజురోజుకూ చెట్ల సంఖ్య తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మనం పీల్చే గాలిని కూడా కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ భూతంతో పర్యావరణం పాడవుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లింగం, ఆనంద్ గౌడ్, నర్సింహరావు, దామోదర్, గౌస్‌పాషా, శివారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో లభిస్తాయన్నారు. 17వ తేదీ సాయంత్రం 5గంటలలోపు పూరిచేసిన దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీరు మారేనా!

అవినీతికి అడ్డాగా మారిన తాండూరు ఎస్‌ఆర్‌ఓ

- ఇప్పటికే ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవడంతో అక్రమాలు
- ప్రక్షాళణ దిశగా ప్రభుత్వం
- తాండూరుకు వచ్చేందుకు జంకుతున్న అధికారులు



తాండూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తాండూరు: అక్రమ రిజిస్ట్రేషన్లకు తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారింది. అవినీతికి కేరాఫ్‌గా మారిన ఈ ఆఫీసులో డ్యూటీ చేసేందుకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు జంకుతున్నారు. తాండూరుకు వచ్చేందుకు ససేమిరా అంటున్నట్లు సమాచారం. రెండున్నరేళ్ల వ్యవధిలో ఒకరు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా మరో ఇద్దరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడి సస్పెన్షన్‌కు గురయ్యారు. 2017 నుంచి నేటి వరకు తాండూరు కార్యాలయంలో 11 మందికి పైగా సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వహించారు. వీరిలో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ అధికారులు. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంలో ముగ్గురు అధికారులు బదిలీ చేయించుకొని ఇతర జిల్లాలకు వెళ్లారు. నాటి నుంచి ఇన్‌చార్జులే దిక్కయ్యారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ సురేందర్ నాయక్ 16 నెలల పాటు విధులు నిర్వహించగా, చాంద్ బాషా ఏడాది పాటు పని చేశారు. 2024 నుంచి 25 ఫిబ్రవరి వరకు పుర్యనాయక్ రెగ్యులర్ బాధ్యతలు నిర్వహించారు. ఈయనపై డాక్యుమెంట్ రైటర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం, మరోవైపు స్థానిక నేతల నుంచి ఒత్తిడి పెంచడంతో చేసేది లేక బదిలీ చేయించుకొని వెళ్లారు. అప్పటి నుంచి సీనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి ఆరు నెలలకు ఒకరు చొప్పున ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. 2020లో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేశారు. దీంతో కార్యాలయంలో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్ వివరాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలిసిపోతాయి. ఆన్‌లైన్ లోపాలను ఆసరాగా చేసుకొని కొందరు ఇన్‌చార్జులు అక్రమాలకు పాల్పడ్డారు. 2022 డిసెంబర్‌లో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన జమీరొద్దీన్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యారు. గత నెలలో అనుమతులు లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారంటూ ఇద్దరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లు ఫసీయొద్దీన్, పవన్‌పై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

రియల్ వ్యాపారులదే పెత్తనం

తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్ల జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో రియల్ వ్యాపారులు, పాత నేరస్తుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కూడా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. కొంతమంది రియల్టర్లు అధికారుల ఇళ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

డబుల్ రిజిస్ట్రేషన్లు

సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించడంతో అవినీతి అక్రమాలు జోరందుకున్నాయి. గతంలో ఒకే ప్లాట్‌కు రెండు రిజిస్ట్రేషన్లు చేశారు. మున్సిపల్ రోడ్డుకు కూడా రిజిస్ట్రేషన్ చేశారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన సీరియస్ అయినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పారదర్శకంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కొందరు రియల్టర్లు ఎమ్మెల్యేను కలిసి సమస్య పరిష్కరించాలని కోరగా వారిని వెనక్కు పంపినట్లు తెలిసింది. తాండూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కోరినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే తాండూరు కార్యాలయానికి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ వస్తారని పేర్కొన్నారు. కార్యాలయాన్ని శాశ్వత భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

ఆ సమయంలోనే అక్రమాలు

మూడు నెలల క్రితం తాండూరు సబ్ రిజిస్ట్రార్ పుర్య బదిలీ అయ్యారు. దీంతో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో 20 రోజుల పాటు విధులు నిర్వహించిన ఆయన 27 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న పవన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని పవన్ 10 రోజుల వ్యవధిలో 70 ప్లాట్లకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత ఆయన కూడా సెలవులో వెళ్లిపోయారు. దీంతో మరో జూనియర్ అసిస్టెంట్ ఫసియొద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు. రోజుకు దాదాపు 50 చొప్పున ఐదు రోజుల వ్యవధిలో 200 రిజిస్ట్రేషన్లు చేశారు. ఉన్నతాధికారులకు అనుమానం రావడంతో విచారణకు ఆదేశించారు. దీంతో అసలు విషయం బయట పడింది. పది రోజుల క్రితం ఫసియొద్దీన్‌ను సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల ఆడిట్‌లో పవన్ సైతం అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు తేలింది. దీంతో ఆయన్ను కూడా సస్పెండ్ చేశారు.



మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

పర్యావరణాన్ని కాపాడుకుందాం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వికారాబాద్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణంలో వస్తున్న మార్పులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వెంకటేశ్వర్లు, పీపీలు దీపారాణి, అన్వేష్‌సింగ్, సమీనాబేగం, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

ఈ నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్‌పై జిల్లా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీపడదగ్గ కేసులను అధిక సంఖ్యలో రాజీపడేలా చూడాలని ఆదేశించారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంటే ఇద్దరు గెలిచినట్లే అవుతుందన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. ఈ విషయంలో పోలీసులు ఆయా పీఎస్‌ల వారీగా రాజీకి ఆస్కారం అవకాశం ఉన్న కేసులు ఉన్న వారిని రాజీకుదుర్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి వెంకటేశ్వర్లు, ఎస్పీ నారాయణరెడ్డి, పబ్లిక్ ప్రాస్యిక్యూటర్ దీపారాణి అన్వేష్‌సింగ్, సమీనాబేగం, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, దానయ్య, సీఐలు భీంకుమార్, సంతోష్, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల బాధ్యత సంతానానిదే

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: వయోవృద్ధుల పోషణ, సంక్షేమం వారి సంతానందేనని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా కార్యదర్శి జూకరెడ్డితో కలిసి వయోధికుల చట్టంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వయోధికుల వేధింపుల చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో మోమిన్‌పేట మండల అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్‌కుమార్



వికారాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవనం

ప్రారంభించారు.. ప్రవేశం మరిచారు

- నెల రోజుల క్రితం జనరల్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి దామోదర
- నేటికీ అందుబాటులోకి రాని వైనం
- పాత భవనంలోనే సేవలు
- గదులు సరిపోక ఇబ్బంది పడుతున్న రోగులు

వికారాబాద్: జిల్లా కేంద్రంలో ఆర్భాటంగా ప్రారంభించిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవనం నేటికీ అందుబాటులోకి రాలేదు. నెల రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నూతన భవనాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే పూర్తిస్థాయిలో పనులు కాకపోవడం వల్లే ఆస్పత్రిని అందులోకి తరలించలేదని తెలిసింది. ప్రస్తుతం పాత భవనంలోనే చాలీచాలనీ వసతులతో సేవలు అందిస్తున్నారు. దీంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

330 పడకల సామర్థ్యంతో..

రెండున్నరేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వికారాబాద్‌కు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. భవన సముదాయం, ఇతర వసతుల కోసం రూ.240 కోట్లు మంజూరు చేసింది. గత విద్యా సంవత్సరం వంద మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాలతో పాటు అనుబంధం జనరల్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 330 పడకల సామర్థ్యం గల నూతన భవనాన్ని నిర్మించాల్సి ఉంటుంది. పట్టణ పరిధిలోని ఎస్‌ఏపీ కళాశాల ఎదుట నూతన భవన నిర్మాణం చేపట్టారు. తుది దశ పనులు జరుగుతుండగానే ప్రారంభించారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ వైద్య సేవలు అందిచడం సాధ్యం కాదని భావించిన అధికారులు ఆస్పత్రిని అక్కడికి తరలించలేదు. ప్రస్తుతం బస్టాండ్ రోడ్డులో గల ఏరియా ఆస్పత్రి పాత భవనంలో జనరల్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంద బెడ్లు కూడా లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

నత్తనడకన పనులు

జిల్లా కేంద్రంలో రెండున్నరేళ్ల క్రితం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేయాలని షరతు విధించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేయలేదు. దాదాపు మూడేళ్లు కావస్తున్నా భవనం అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం సకాలంలో బిల్లుల చెల్లించకపోవడంతోనే పనుల్లో జాప్యం జరిగినట్లు తెలిసింది. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తి చేశారు. భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకముందే హడావుడిగా ప్రారంభించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్యను వివరణ కోరగా త్వరలో నూతన భవనంలోకి జనరల్ ఆస్పత్రిని మారుస్తామని తెలిపారు. రెండు నెలల్లో పూర్తి స్థాయిలో భవనం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

బొంరాస్‌పేట: భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని ఎన్కేపల్లి, తిర్మలాపూర్ గ్రామాలకు సంబంధించి ఎన్కేపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తిర్మలాపూర్ నుంచి ఎలాంటి వినతులు రాలేదు. ఎన్కేపల్లిలో 9 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రవి, శైలజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భూభారతి సదస్సులో ఉమాశంకర్ ప్రసాద్

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మారుద్దాం

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



అనంతగిరి: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వికారాబాద్‌ను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం అంతం చేద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం పెరిగి చివరకు మనం తీసుకునే ఆహారంలో కూడా చేరుతోందని తెలిపారు. ఇది మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. అనంతరం అనంతగిరి అర్బన్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, అటవీ రేంజ్ ఆఫీసర్లు శ్యామ్ కుమార్, రాజేందర్, ప్రతిమ, అటవీ సెక్షన్ అధికారి అరుణ, ఉద్యాన్ కేర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, విద్యార్థినులు, సత్యసాయి సేవా ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోదామ్‌ను గురువారం కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం సీల్‌ను ఓపెన్ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి సంతకాలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హోలీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

బంట్వారం: భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం కోట్‌పల్లి మండలం రాంపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. భూ సమస్యలపై రైతులు ఇచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు సూచించారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సహకారంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పిల్లలందరూ బడిలోనే ఉండేలా చూడాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రేషన్ షాపుల్లో మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్

పిచ్చి.. పరాకాష్ట

- ఆర్సీబీ గెలిచినందుకు అరగుండు, చెప్పుల దండతో తిరిగిన యువకుడు
- ఇన్‌స్టా గ్రామ్‌లో చేసిన చాలెంజ్‌ను నిలబెట్టుకున్నానంటూ పోస్టు

తాండూరు టౌన్: పిచ్చి పరాకాష్టకు చేరిందంటే ఇదేనేమో.. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో తన ఫేవరేట్ జట్టు కాకుండా, వేరే జట్టు గెలిస్తే అరగుండు కొట్టించుకొని, మెడలో చెప్పుల దండ వేసుకుని బస్టాండులో తిరుగుతానని తాండూరు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టాడు. ఈ నెల 3న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఓడిపోయి.. ఆర్సీబీ గెలిచిన విషయం తెలిసిందే. దీంతో సదరు యువకుడు చాలెంజ్ చేసిన విధంగా అరగుండు కొట్టించుకొని, మెడలో చెప్పుల దండ వేసుకుని బుధవారం తాండూరు బస్టాండులో తిరిగాడు. ఈ వీడియోను తిరిగి పోస్టు చేసి చాలెంజ్‌ను నిలబెట్టుకున్నానంటూ చెప్పడం విశేషం. అంతేకాకుండా క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లో ముంబై, పంజాబ్ జట్లు తలపడతుండగా పంజాబ్ గెలిస్తే షర్టు లేకుండా చౌరస్తాలో తిరుగుతానని ఇన్‌స్టాగాంలో పోస్టు పెట్టాడు. ఆ రోజు మ్యాచ్‌లో పంజాబ్ గెలవడంతో షర్టు విప్పి అర్ధనగ్నంగా తాండూరు చౌరస్తాలో తిరిగాడు. ఇలా షర్టు లేకుండా తిరగడం, అరగుండు, మెడలో చెప్పుల దండతో తిరిగిన యువకున్ని చూసి జనాలు అవాక్కయ్యారు. పిచ్చి ముదిరితే ఇలాంటి చేష్టలే చేస్తారని, ఈ రోజు చేసిన ఈ చిన్న చాలెంజ్, భవిష్యత్‌లో పెద్ద పెద్ద చాలెంజ్‌లు చేసే పరిస్థితికి వస్తుందని జనాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యువకులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలే తప్ప, ఇలాంటి చాలెంజ్‌లు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోరాదని హితవు పలుకుతున్నారు.



అరగుండు, మెడలో చెప్పుల దండతో యువకుడు, షర్టు లేకుండా..

క్లుప్తంగా

యువకుడిపై పోక్సో కేసు

దోమ: బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ ఇంటి పక్కనే ఉండే బాలిక(15) ఇంట్లో ఎవరూ లేరని గమనించిన యువకుడు (24) ఆమెపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. బాధితురా లు అరుపులు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రుల కు తెలియడంతో 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ స్పష్టంచేశారు.

9న డీఎస్పీ కార్యాలయ ముట్టడి

దళిత, ప్రజాసంఘాల పిలుపు

తాండూరు టౌన్: దళిత యువకుడి పెళ్లి బారాత్‌ను అడ్డగించి, దాడికి పాల్పడిన అగ్రకుల వ్యక్తులను అరెస్టు చేయని పోలీసుల తీరును నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు దళిత, ప్రజా సంఘాల నాయకులు గురువారం తెలిపారు. గత నెల 18వ తేదీన తాండూరు మండలం బెల్కటూర్ గ్రామానికి చెందిన వినయ్ కుమార్ పెళ్లి బారాత్ సందర్భంగా అగ్రకులస్తులు దాడి చేశారంటూ పోలీసులకు పలువురు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ విషయంలో నేటి వరకు ఏఒక్కరిపై కూడా కేసు పెట్టకుండా, అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకోలేదని కేవీపీఎస్, సీఐటీయూ, ఎమ్మార్పీఎస్, పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు మల్కయ్య, శ్రీనివాస్ తదితరులు అసహనం వ్యక్తం చేశారు.

వసతి గృహానికి రంగులు



తాండూరులోని బీసీ బాలుర వసతి గృహాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

తాండూరు: విద్యా సంవత్సరం మరో వారం రోజుల్లో ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాలను సిద్ధం చేస్తున్నారు. గురువారం తాండూరు పట్టణ శివారులోని బీసీ బాలుర వసతి గృహంలో గదులను శుభ్రం చేస్తున్నారు. విద్యార్థులకు భోజనం అందించేందుకు కావాల్సిన సరుకులను, గ్యాస్ సిలిండర్లు, బియ్యం, పప్పు నిత్యావసర సరుకులు ముందుగానే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే వసతి గృహానికి రంగులు వేసి విద్యార్థుల రాకకోసం ఎదురు చూస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పూడూరు: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలో కండ్లపల్లి గేటు సమీపంలోని నీలగిరి చెట్లలో ఉందని తెలిపారు. పశువుల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూశారు. మహిళ మూడు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని, సుమారు 50నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతురాలి వేలికి ఉంగరం, బ్లూ కలర్ చీర, ఆకుపచ్చ జాకెట్ ధరించి తెల్ల వెంట్రుకలతో ఉందని తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీధి కుక్కల దాడి

- 250 నాటుకోళ్లు మృత్యువాత
- రూ.2 లక్షలకు పైగా నష్టం

నందిగామ: వీధికుక్కల దాడిలో 250 నాటు కోళ్లు మృత్యువాత పడ్డాయి. రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. వివరాలివీ.. మండల పరిధిలోని రంగాపూర్‌కు చెందిన వన్నల్లి మల్లేశ్ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. ప్రస్తుతం ఈ షెడ్డులో సుమారు 300 వరకు కోళ్లు పెరుగుతున్నాయి. బుధవారం రాత్రి వాటికి దాణా వేసి షెడ్డుకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వెళ్లి చూసే సరికి సుమారు 250 కోళ్లు మృతి చెంది కనిపించాయి. షెడ్డు పక్కన ఉన్న ఇనుప జాలీని కింది నుంచి తొలగించిన కుక్కలు లోనికి ప్రవేశించి కోళ్లను కొరికివేసినట్లు గుర్తించాడు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం .. ఆమనగల్లు పట్టణంలోని నుగులబండ కాలనీకి చెందిన మల్లేశ్ (35) గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన బంధువుల వివాహానికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తిరిగి వస్తుండగా వెల్దండ మండల కేంద్రం సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జాతీయ రహదారిపై పత్తాలేని పెట్రోలింగ్!

కనిపించని గస్తీ వాహనాలు

- జిల్లా పరిధిలో రెండు పీఎస్‌లు ఉన్నా సేవలు అంతంతే
- హైదరాబాద్– బీజాపూర్ హైవేపై నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసు అధికారులు



మన్నెగూడ హైవే పెట్రోలింగ్ స్టేషన్

పరిగి: జాతీయ రహదారి వెంట ఎక్కడా పోలీసులు కనిపించడం లేదు. క్రమం తప్పకుండా గస్తీ నిర్వహిస్తూ అనుక్షణం పర్యవేక్షించాల్సిన వాహనాలు సైతం పత్తాలేకుండా పోయాయని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగిన సమయంలో వెంటనే స్పందించే వారు లేక క్షతగాత్రులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై యాక్సిడెంట్లను నివారించడంతో పాటు ప్రమాదాలు జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు హైవే పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. కానీ వీటిలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైవేలపై నిత్యం యాక్సిడెంట్లు చోటు చేసుకుంటున్నా పోలీసులు ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక వెళ్లేందుకు హైదరాబాద్– బీజాపూర్ మార్గం ఒక్కటే ఉంది. మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సైతం ఈరూట్‌లోనే రాకపోకలు సాగిస్తాయి. రద్దీ కారణంగా ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైవే పెట్రోలింగ్ పోలీసుల అలసత్వంతోనే ఈ పరిస్థితి ఎదురవుతోందనే ఆరోపణలున్నాయి.

రెండు హైవే పోలీస్ స్టేషన్లు

పూడూర్ మండలం అంగడి చిట్టంపల్లి నుంచి కొడంగల్ మండలం రావులపల్లి వరకు జిల్లాలో జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈమార్గంలో రెండు హైవే పెట్రోలింగ్ పోలీస్ స్టేషన్లు ఉన్నప్పటికీ నామమాత్రంగానే సేవలు అందిస్తున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం మన్నెగూడ, కొడంగల్‌లో వీటిని ఏర్పాటు చేశారు. అప్పట్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించినా ప్రస్తుతం ఒక స్టేషన్‌లో ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. అరకొర సిబ్బందితో విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. మన్నెగూడలో ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ స్టేషన్ సిబ్బంది అంగడిచిట్టంపల్లి నుంచి గడిసింగాపూర్, కొండంగల్ పీఎస్ సిబ్బంది రావుపల్లి నుంచి గడిసింగాపూర్ వరకు విధులు నిర్వహించాలి. కానీ వీరు ఏ ఒక్క రోజు కూడా కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు.

నిత్యం ప్రమాదాలు

జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. రాత్రి వేళ వీటిని ఢీకొట్టి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు వెంట పోలీసులు, పెట్రోలింగ్ వాహనాలు లేకపోవడంతో కొంత మంది ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఇప్పటికైనా హైవే పెట్రోలింగ్ పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

వెంటనే స్పందిస్తున్నారు



జాతీయ రహదారిపై రెండు పెట్రోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. రెండు షిఫ్టులుగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. హైవేపై ప్రమాదాలు జరిగిన వెంటనే మా అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి సకాలంలో చర్యలు తీసుకుంటున్నారు.

– శ్రీనివాస్, పరిగి డీఎస్పీ

అటవీ భూమి కబ్జా

- ఇస్మాయిల్‌పూర్‌లో 5 ఎకరాల్లో విత్తనాలు నాటిన రైతులు
- అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
- ఆందోళనకు దిగిన అన్నదాతలు

బషీరాబాద్: మండలంలోని మైల్వార్ రిజర్వుడు ఫారెస్టులో 5 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. నీళ్లపల్లి ఫారెస్టు సెక్షన్‌లోని సర్వేనంబర్ 20లో ఇస్మాయిల్‌పూర్ తండాకు చెందిన బలరాం నాయక్, రెడ్యానాయక్, భీమ్లానాయక్ గుట్టుచప్పుడు కాకుండా విత్తనాలు నాటారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ ఫారెస్టు సెక్షన్ అధికారి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప గురువారం అక్కడికి చేరుకొని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇదే భూమి విషయం కోర్టులో కేసునడిచింది. కొన్ని నెలల తర్వాత అవీ అటవీ భూములేనని కోర్టు కూడా తీర్పు ఇచ్చిందని వ్యవసాయ అధికారులు గుర్తు చేశారు. అటవీ భూములు కబ్జా చేసి సాగు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. వెంటనే ఆ భూముల్లో గోతులు తీయించారు. త్వరలో మొక్కలు నాటుతామని అధికారులు తెలిపారు.

రైతుల వాగ్వివాదం..

కబ్జాకు గురైన భూమిని స్వాధీనానికి వెళితే సాగు చేసిన రైతులు వారిపై గొడవకు దిగారు. తాము ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నామని తమ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అధికారులు కేసులు పెడుతామని హెచ్చరించడంతో రైతులు వెనుకంజ వేశారు.



స్వాధీనం చేసుకున్న భూముల్లో గోతులు తీయిస్తున్న సెక్షన్ అధికారి స్నేహశ్రీ

దిగబడిన వరిధాన్యం లారీ



డీసీఎంఎస్ గేట్ ఎదుట నిలిచిన లారీ

డీసీఎంఎస్ గేట్ దాటుతుండగా ఘటన

- గోదాంలలోకి వాహనాల రాకపోకలకు అంతరాయం

తాండూరు: తాండూరు డీసీఎంఎస్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద వరిధాన్యం లోడ్ లారీ దిగబడింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. డీసీఎంఆర్ ద్వారా కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తాండూరు డీసీఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలోని గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. అందులో భాగంగా యాలాల మండలం నుంచి 18 టైర్లు కలిగిన పెద్ద లారీలో వరి ధాన్యంతో డీసీఎంఎస్ గేట్‌లోకి ప్రవేశించింది. ఇటీవల రోడ్డు వెడల్పుతో డీసీఎంఎస్ గేట్ వద్ద గుంతలా మారింది. దీంతో లారీ రెండు వైపులా ఇరుక్కుపోయి అక్కడే ఆగిపోయింది. బుధవారం రాత్రి నుంచి లారీని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. మరోసారి గురువారం ఉదయం లారీని పక్కకు తప్పించేందుకు ప్రయత్నించారు. వీలు కాకపోవడంతో లారీలో ఉన్న ధాన్యం బస్తాలను దింపి పక్కకు తప్పించారు. దీంతో కొనుగోలు కేంద్రాల నుంచి లోడ్‌తో వచ్చిన లారీలు రోజంతా నిలిచి పోయాయి.

ప్రభుత్వ భూములను కాపాడండి



డిప్యూటీ తహశీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రెవెన్యూ సదస్సులో తోల్‌కట్టవాసుల వినతి

మొయినాబాద్ రూరల్: మండలంలోని తోల్‌కట్ట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు గ్రామస్తులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై పలుమార్లు మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని తెలిపారు. ఎక్స్ సర్వీస్‌మెన్ల పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. కొంతమంది బడాబాబులకు అసైన్డ్ పట్టాలు, పాసు పుస్తకాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. పేదలు సాగు చేసుకునేందుకు మాత్రం అనుమతించడం లేదని మండిపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ఒకే సర్వే నంబర్‌లోని భూమిని ఇద్దరు సోదరుల్లో ఒకరికి పట్టా చేసి, మరొకరికి లావణి పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. భూభారతిలోనైనా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్తులు భిక్షపతి, జంగయ్య, మల్లయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే బీఎంఆర్ పర్యటన

తాండూరు: తాండూరు పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాండూరు పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయ భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపనలు చేయనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన వంట పాత్రల పంపిణీ, మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని క్యాంపు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

యాచారం: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడకు చెందిన గౌర శ్రీకాంత్(22) బుధవారం అర్ధరాత్రి గునుగుల్ గేట్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. అతివేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఇందిరానగర్ సమీపంలో అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో శ్రీకాంత్ స్పాట్‌లోనే చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

పట్టుబడ్డ మేకల దొంగలు

కొందుర్గు: మేకలు ఎత్తుకెళ్తున్న దొంగలు పట్టుబడ్డ సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బంగారు జంగయ్య పొలం నుంచి బుధవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్తుండగా స్థానికులు పట్టుకున్నారు. వారిని విచారించగా కొందుర్గుకు చెందిన వంశీ, హరికృష్ణ, ప్రశాంత్ అని తేలింది. జంగయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

పద్మమ్మ అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి



అంత్యక్రియలకు హాజరైన సబితారెడ్డి, తదితరులు

ధారూరు: చింతకుంట గ్రామంలో గురువారం మృతి చెందిన పద్మమ్మ అంత్యక్రియలకు మాజీ మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి అక్క, సబితారెడ్డికి వదిన మృతి చెందినట్లు సమాచారం అందటంతో కొడుకు కార్తీక్‌రెడ్డితో కలిసి చింతకుంటకు చేరుకున్నారు. వీరితో పాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన డీసీఎం
- అక్కడికక్కడే ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి (40) డీసీఎం వాహనంలో పౌల్ట్రీ దాణా వేసుకుని డ్రైవర్ సునావత్ గణేశ్‌తో కలిసి గురువారం తెల్లవారుజామున 5గంటలకు ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ ఎగ్జిట్ నంబర్ 11 సమీపంలోకి రాగానే ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి వీరి వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదగిరి తీవ్ర గాయాలతో అక్కకక్కడే మృతిచెందగా, డ్రైవర్ గణేశ్‌కు గాయాలయ్యాయి. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆటో డ్రైవర్ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- రాజేంద్రనగర్ పోలీసులు చిత్రహింసలకు గురి చేసినందునే..
- పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసు స్వీకరణ
- రెండు వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని డీజీపీకి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: పోలీసు కస్టడీలో హింసకు గురై వ్యక్తి మరణించాడనే ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై పత్రికలు, టీవీ చానళ్లలో వచ్చిన వార్తల ఆధారంగా తాము సుమోటోగా కేసు స్వీకరించినట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. వివరాలివీ... 'హైదరాబాద్ రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్(35), అతని భార్యకు మధ్య కొన్ని మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో 2025 మే 13న ఆటో డ్రైవర్‌ను అతని భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. దంపతులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌ను ఒక గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ పోలీసులు అతడిని రబ్బరు బెల్టుతో తీవ్రంగా కొట్టారు. గంట తర్వాత అతడిని పోలీసులు వదిలి పెట్టారు. పోలీస్ స్టేషన్ బయటికి రాగానే వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను మరణించారని వైద్యులు ధ్రువీకరించారు'. ఈ కథనాలను పరిగణలోకి తీసుకుని సుమోటోగా కేసును స్వీకరించినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది. ఈ విషయాన్ని డీజీపీకి జారీ చేసిన నోటీసుల్లోనూ స్పష్టం చేసింది. మీడియాలో వచ్చినది నిజమైతే ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పష్టం చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలని డీజీపీని ఆదేశించింది.

పట్టుబడ్డ గంజాయిని కొట్టేసి..

- బంధువు ద్వారా విక్రయం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ నిర్వాకం
- పోలీసుల అదుపులో నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: వచ్చే జీతంతో తృప్తి పడని ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ పని చేసే స్టేషన్‌లోనే గతంలో పట్టుబడిన గంజాయిని దొంగిలించి.. విక్రయిస్తూ పట్టుబడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద చోటుచేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ గురువారం వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గులామ్ సుల్తాన్ అహ్మద్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ అతను వచ్చే వేతనం సరిపోక అక్రమ మార్గం ఎంచుకున్నాడు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తూ విలాస జీవితానికి అలవాటుపడ్డాడు.

అక్కడ దొంగిలించి.. ఇక్కడ విక్రయిస్తూ

స్టేషన్‌లో గతంలో పట్టుబడిన గంజాయిని గులామ్ సుల్తాన్ అహ్మద్ దొంగిలించేవాడు. దానికి తనకు వరుసకు కుమారుడైన షాద్‌నగర్ పట్టణానికి చెందిన అంజాద్‌కు విక్రయించేందుకు అప్పగించేవాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న రూ.75 వేల విలువ చేసే కిలోన్నర గంజాయిని విక్రయించేందుకు అంజాద్ బుధవారం రాత్రి ఈద్గా సమీపంలోకి చేరుకున్నాడు. అదే సమయంలో ఎస్ఐ దేవరాజ్ అధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అంజాద్ కవర్ పట్టుకొని అనుమానాస్పదంగా తచ్చాడడం గమనించారు. అతడి వద్ద ఉన్న కవర్‌ను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో విచారించగా నేరం అంగీకరించాడు. ఈ మేరకు ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు.

మొక్కల సంరక్షణతోనే మనుగడ



కొడంగల్: జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయవాదులు



కొడంగల్ రూరల్: మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



ధారూరు: అల్లిపూర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీడీఓ నర్సింహులు తదితరులు

కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండలం కామునిపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అనితారెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోర వెంకటయ్య, రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్లిపూర్‌లో..

ధారూరు: అల్లిపూర్ గ్రామంలో ధారూరు ఎంపీడీఓ నర్సింహులు, కాంగ్రెస్ నాయకుడు గంధం హన్మయ్యతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతీ ఇంటి ఆవరణలో మొక్క నాటి పెంచాలన్నారు. గ్రామ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

కొడంగల్ రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వారు మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ టి రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఆర్ శ్రీనివాస్, డాక్టర్ ఈ సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

కొడంగల్: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కొడంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బార్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ బస్వరాజు, న్యాయవాదులు బి.కృష్ణయ్య, కె.రమేష్, మొహీద్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: హకీంపేట్ గ్రామంలో డాక్టర్ వందన ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పర్యావరణంపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి ఆనందం, మండల కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్ రామేశ్వరి, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న దుకాణదారుడికి ఫైన్ వేసి రసీదు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఇబ్రహీంపట్నం: ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ కోరారు. 100 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం నాలుగోరోజు ఇబ్రహీంపట్నంలో దుకాణాలను తనిఖీలు చేసి ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న వాటికి ఫెనాల్టీ విధించారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్స్ వాడకంతో పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని అన్నారు. కాలుష్య వాతావరణం ఏర్పడి మనుషులతోపాటు పశుపక్ష్యాదులపై దీని ప్రభావం పడుతుందన్నారు. దుకాణాల్లో వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్స్‌ను ఉపయోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ ప్రణవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.